
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
సోమవారం 20 అక్టోబరు 2025



జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు: కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు దీపావళి, దండారి, గుస్సాడీ పండుగల సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు పండుగలను సురక్షితంగా, శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. గిరిజనుల సంప్రదాయ పండుగ అయిన దండారి గుస్సాడీ సందర్భంగా గిరిజన సోదరులు, కళాకారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. గుస్సాడీ నాట్యం గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అని పేర్కొన్నారు. విలువైన వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ పండుగలను శాంతి, ఐకమత్యం, సోదరభావంతో జరుపుకోవాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



ఉమ్మడి జిల్లాలో ఘనంగా
గుస్సాడీ దండారీ ఉత్సవాలు
8



మాట్లాడుతున్న లేబర్ ఆఫీసర్ రాజలింగు

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.రాజలింగు అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా స్థానిక రామ్‌లీలా మైదానంలో ఏర్పాటుచేసిన టపాసుల దుకాణాల వద్ద ఆదివారం షూర్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాబాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, వన్ టౌన్ ఎస్సై సయ్యద్ ఇసాక్ లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో క్రాకర్ షాప్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేందర్, షూర్ ఎన్‌జీఓ జిల్లా కోఆర్డినేటర్ కె.వినోద్, ఫీల్డ్ సూపర్‌వైజర్లు కిరణ్, సౌజన్య, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ అనిల్, కేస్ వర్కర్ రామకృష్ణ పాల్గొన్నారు.

బొంతలసీమను తాకిన గాజుల పండుగ

నేరడిగొండ, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): నీకు నేను.. నాకు నువ్వు అంటూ కుల మతాలకు అతీతంగా జరుపుకుంటున్న గాజుల పండుగను లక్కంపూర్ గ్రామమహిళలు బొంతలసీమకు గాజుల పండుగను పరిచయం చేశారు. గాజులు తొడిగి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమ స్నేహం ఇలాగే వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ పండుగలో లక్కంపూర్ గ్రామ మహిళలందరూ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలు
గాడిన పడేదెన్నడో?



- స్థానిక సంస్థల ఎన్నికలపై వీడని సందిగ్ధత
- జీపీలకు పాలకవర్గం లేక రెండేళ్లు కావస్తున్న వైనం
- ఎక్కడికక్కడ పేరుకుంటున్న సమస్యలు
- నిధుల్లేక ఉద్దెరపై పనులు చేపడుతున్న కార్యదర్శులు
- ఔట్‌సోర్సింగ్ సెక్రటరీలకు ఆరు నెలలుగా అందని వేతనాలు

పాలక వర్గాలు లేక గ్రామ పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయి? గ్రామ పంచాయతీలకు నిధులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్న ప్రజల ఆశగా ఎదురుచూస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి 20 నెలలు కావస్తోంది. ప్రభుత్వం ఎన్నికలు షెడ్యూల్ విడుదల చేసినా బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే రావడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై నేటికీ సందిగ్ధత నెలకొంది.

ఉట్నూర్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 467 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండల కేంద్రాల్లో ఉన్న పంచాయతీలు కొన్ని మేజర్ పంచాయతీలు, మిగతావి మైనర్ గ్రామపంచాయతీలుగా ఉన్నాయి. 500 జనాభా ఉన్న ప్రతీ గ్రామాన్ని గ్రామపంచాయతీగా చేయడంతో ప్రజలకు పంచాయతీల పాలన అందుబాటులోకి వచ్చినా ప్రభుత్వం నుంచి నిధులు రాక ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సర్పంచ్‌ల పదవీకాలం 20నెలల క్రితం ముగిసింది. అప్పటినుంచి గ్రామాల్లోని సమస్యలను పట్టించుకునేవారు కరువయ్యాయి. కొంతకాలం ప్రత్యేక అధికారులు నియమించినా అదనపు పనిభారంతో సమస్యలపై దృష్టిపెట్టలేకపోయారు. ఫలితంగా గ్రామాల్లోని పారిశుధ్య, తాగునీరు, తదితర కార్యక్రమాలు సక్రమంగా సాగడంలేదు.

అప్పుల్లో కార్యదర్శులు

గ్రామ పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి ముందునుయ్యి వెనుకగొయ్యి అన్నట్లుగా మారింది. గత బీఆర్‌ఎస్ హయాంలో ప్రతీ గ్రామపంచాయతీకి ప్రభుత్వం ట్రాక్టర్లు అవసరమని, వాటి ద్వారా పరిసరాలు అపరిశుభ్రం చేసుకునే అవకాశం ఉంటుందని ప్రజాప్రతినిధులే ట్రాక్టర్ షోరూమ్‌లను ఏర్పాటు చేసుకుని పంచాయతీలకు అరువుపై ట్రాక్టర్లను మంజూరుచేశారు. నాలుగేళ్లపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం (వివరాలు 6లో..)

వెలుగుల పండుగకు సర్వం సిద్ధం



ప్రమిదలను కొంటున్న ప్రజలు



టపాసుల వద్ద కొనుగోలుదారుల సందడి

ఆదిలాబాద్‌టౌన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): చిన్నాపెద్దా సంబరంగా జరుపుకునే పండుగల్లో ఒకటైన దీపావళి వేడుకలను జరుపుకునేందుకు జిల్లావాసులు సన్నద్ధమయ్యారు. పండగకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయడానికి వస్తున్న ప్రజలతో పట్టణంలోని ప్రధాన వీధులు సందడిగా మారాయి. పట్టణంతో పాటు చుట్టుపక్కల పల్లెల ప్రజలు భారీగా తరలిరావడంతో ఎక్కడచూసినా సందడి వాతావరణం నెలకొంది. పండగ సామగ్రి అయిన పూలు, పండ్లు, లక్ష్మీదేవి చిత్రపటాలు, ప్రమిదల అమ్మకాలతో మార్కెట్‌లో కోలాహల వాతావరనం కనిపించింది. విభిన్నరకాల డిజైన్‌లతో ఉన్న ప్రమిదలను ఖరీదు చేయడానికి మహిళలు ఆసక్తిచూపారు. ఇక పూజకు సంబంధించిన బంతిపూలు, పండ్లు ఇతరత్రా సామగ్రిని ఖరీదు చేశారు. పట్టణంలోని రాంలీలా మైదానంలో టపాసుల దుకాణాలు వెలియడంతో వినాయక్‌చౌక్‌కు వెళ్లే ప్రధాన రహదారి కిక్కిరిసిపోయింది.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో కలెక్టర్ పూజలు



పూజలు చేస్తున్న కలెక్టర్ రాజార్షిషా

జైనథ్,అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గల శ్రీలక్ష్మి నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం కలెక్టర్ రాజార్షిషా కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలను చేశారు. ఆలయాన్ని పరిశీలించి ఆలయ విశిష్టతను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. స్వామివారిని పాదాలపై పడే సూర్య కిరణాలను తిలకించారు. ఆలయ కమిటీ చైర్మన్ కలెక్టర్ రాజార్షిషాను స్వామివారి మెమోంటోతో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అడ్డి రుకేష్‌రెడ్డి, ఆలయ అర్చకులు వెంకయ్య, ఇండోమెంట్ అధికారి సాయికిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బోరజ్ వద్ద గల ఆర్టీవో కార్యాలయం

బోరజ్ చెక్‌పోస్టులో ఏసీబీ అధికారుల తనిఖీలు

- రూ.1.26లక్షల నగదు స్వాధీనం

జైనథ్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ తనిఖీ కేంద్రంలో ఏసీబీ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర నుంచి వచ్చే లారీల నుంచి ప్రైవేట్ సిబ్బంది ద్వారా డబ్బులు వసూలు చేస్తుండడంపై తనిఖీలు చేశారు. శనివారం అర్ధరాత్రి 12గంటలకు ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో బోరజ్ చెక్‌పోస్టుపై దాడిలు నిర్వహించారు. లెక్కకు మించి ఉన్న రూ.1.26 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో బోరజ్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న అధికారుల అవినీతి మరోసారి బయటపడింది. రవాణా శాఖ అధికారులు బోరజ్ చెక్‌పోస్టులో ప్రైవేట్ సిబ్బందిని నియమించి అధిక లోడుతో వెళ్తున్న లారీల నుంచి పర్మిట్ వసూళ్లను కొనసాగిస్తున్నట్లు తెలిసింది. దీంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం 5గంగల వరకు ఏసీబీ సోదాలు కొనసాగాయి.

బోథ్ రోడ్లకు మహర్దశ

నేరడిగొండ,అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలోని 35రోడ్లకు హైబ్రిడ్ అన్యుటి మోడల్ (హెచ్ ఏఎం)లో భాగంగా నిధులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. త్వరలోనే ఈ రోడ్లు టెండర్లకు చేరనున్నాయి. గుంతలుగా ఉన్న ప్రతీ రోడ్డును అందంగా మారుస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

తాంసి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్‌రాష్ట్ర రహదారిపై ఆదివారం సాయంత్రం తాంసి పోలీసుల బృందం ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనదారునికి సంబంధించిన పత్రాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి అనుమతి లేని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఉత్తమ్, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, సంతోష్ ఉన్నారు.

టీకాలతోనే గాలికుంటు నివారణ

నేరడిగొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టీకాలతోనే గాలికుంటు నివారణ సాధ్యమని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. మండలంలోని ధన్నూర్‌డిలో ఆదివారం పశువులకు గాలికుంటూ నివారణ టీకాలు వేశారు.

ఉద్యోగుల సమావేశం

తలమడుగు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖోడద్ గ్రామ ఉద్యోగులు, కేంద్ర, రాష్ట్ర సర్వీసులో ఉన్న ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు అందరూ ఆదివారం ఖోడద్ గ్రామ పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. గ్రామ సమస్యలను చర్చించి పరిష్కరిచేందుకు ఒక కమిటీని తీర్మానించారు.

తాంసిలో జీపీవోల నియామకం

తాంసి,అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలానికి నలుగురు జీపీవోలు (పంచాయతీ ఆఫీసర్లు)గా నియమితులయ్యారు. నియమితులైన జీపీవోలు బాధ్యతలను తీసుకున్నారు. క్లస్టర్ల వారిగా వారికి నియామక పత్రాలను తహసీల్దార్ అందజేశారు. గిరిగావ్, అంబుగావ్ గ్రామపంచాయతీలకు భాగ్యలక్ష్మిని నియమించారు. కప్పర్ల గ్రామపంచాయతీ క్లస్టర్‌కు సువర్ణ బాధ్యతలను తీసుకున్నారు. హసనాపూర్, వడ్డాది, పొన్నారి గ్రామపంచాయతీలకు సలీంను నియమించారు. బండల్నాగాపూర్, సవర్గావ్, గొట్కూరి గ్రామాలకు జాహ్నవిని నియమించారు. తాంసి, జామిడి, పాలోడి గ్రామాలకు సంబంధించిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ మేరకు నియమితులైన వారు బాధ్యతలను తీసుకున్నారు.

దండారి ఉత్సవాలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అశోక్

సిరికొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయిగూడ గ్రామంలో మంగళవారం నిర్వహించే సామూహిక దండారి ఉత్సవాలను విజయవంతం చేయాలని స్మామాట్ అశోక్ చారిబుల్ ట్రస్ట్ చైర్మన్ ముస్తాపురే అశోక్ అన్నారు. ఆదివారం సిరికొండ మండలంలోని రాయిగూడ గ్రామంలో ఆదివాసి నాయకులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న మంగళవారం రాయిగూడ గ్రామంలో స్మామాట్ అశోక్ చారిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక దండారి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.



వెంకటేశ్వరరావును స్వాగతిస్తున్న గుస్సాడీలు

ఆదివాసీలు ఆచార సంప్రదాయాలను మరవొద్దు

బోథ్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఆదివాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోవద్దని, వాటిని ఆచరించాలని వనవాసి కళ్యాణ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు దేశ్‌పాండే అన్నారు. ఆదివారం మండలంలోని ఇంకర్‌గూడ గ్రామంలో జరిగిన బండారి ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొమురంభీం భీర్సాముండే రాణి దుర్గావతి వంటి గొప్ప యోధుల ఆశయాలను కొనసాగించాలన్నారు. వారు ఆదివాసీ సమాజం కోసం పని చేసిన గొప్ప వారన్నారు. కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకోవాలని ఏకంగా ఉంటే సాధించ లేనిది ఏది లేదన్నారు. కార్యక్రమంలో సార్‌మేడి ఆడంబీమ్రావుపటేల్, జుగాది రావు, పంద్రశంకర్, జిల్లా ఇతరక్ష ప్రముఖుల వనవాసి కళ్యాణ పరిషత్ తులసి అజయ్ ఆదిలాబాద్ విభాగం సంఘటన మంత్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్‌రావుదేశ్‌పాండే, న్యాయవాదులు హరీష్, నరేష్, కపిల్‌లతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా దండారీ వేడుకలు

భీంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడా గావ్, రాజ్‌గాడ్, బుర్కపల్లి, నిపాని తదితర గ్రామాల్లో దండారీ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఆదివారం డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జడ్పీటీసీ కుంరా సుధాకర్, న్యాయవాది, బీఆర్ఎస్ నాయకుడు కేమా శ్రీకాంత్‌లు ఆ గ్రామాలను సందర్శించి దండారీ వేడుకల్లో పాల్గొన్నారు. ఆదివాసి గ్రామాల ప్రజలు డప్పు వహిద్యల నడుమ స్వాగతం పలికారు. దీపావళి సందర్భంగా ఆదివాసీలు ప్రదర్శించే దండారీలో నియమనిష్టలు సంప్రదాయం కనిపిస్తుందని వివరించారు.

ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత

ఉట్నూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. టీఎస్ 22టీ 0396 నెంబరు గల లారీ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి తనిఖీ చేయగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండడంతో అదుపులో తీసుకున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మడావి ప్రసాద్ తెలిపారు. డ్రైవర్ జుబైర్ ఖాన్ శనివారం రాత్రి జైనూర్ నుంచి ఉట్నూర్ వైపు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు అంగీకరించాడని, యజమాని అయాష్‌ఖాన్ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు తేలిందన్నారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

రాజ్యాంగాన్ని అవమానించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

బోథ్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి చెంన ఓంప్రకాష్ ఆర్టీసీ మెకానిక్ ఇటీవల బాబాసాహెబ్ అంబేద్కర్‌పైన రాజ్యాంగంపైన అనుచిత వ్యాఖ్యలు చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం బీన్ ఆర్మీ అసెంబ్లీ ప్రెసిడెంట్ భగత్‌ప్రవీణ్ కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎస్సై శ్రీసాయికి వినతిపత్రం అందించారు. ఆయనవెంట అమృత రావు మద్దెల మహేష్‌రమేష్‌లున్నారు.

ఆదిలాబాద్‌టౌన్: భారత రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన ఆర్టీసీ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని కేఆర్‌కే కాలనీకి చెందిన సందీప్ దాండ్లె డిమాండ్ చేశారు. ఈ విషయమై 1వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. రాజ్యాంగాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి బహిరంగ క్షమాపణలు

రాజ్యాంగాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ఆర్టీసీ ఉద్యోగి ఓంప్రకాష్ బహిరంగ క్షమాపణలు కోరారు. స్థానిక అంబేద్కర్ చౌక్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. అంబేద్కర్ విగ్రహ పాదాలకు పాలాభిషేకం చేసి క్షమాపణలు కోరారు. ఓంప్రకాష్ మాట్లాడుతూ రాజ్యంగంపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పశ్చాత్తాపానికి గురై బహిరంగ క్షమాపణలు చెబుతున్నానని పేర్కొన్నాడు. కార్యక్రమంలో ఆర్టీసీ గ్యారేజ్ ఉద్యోగులు శ్రీ శైలం, రాజలింగు, భీం రావు, అశోక్, దత్తు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీతోనే ఉద్యోగాలు'

తలమడుగు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కుచ్చలాపూర్ గ్రామనికి చెందిన సంతోష్ కుమార్తె నీట్‌లో ఎంబీబీఎస్ సీటు సంపాదించడంతో ఆదివారం ఆయన గ్రామానికి వెళ్లి ఆమె సన్మానించారు. అదే గ్రామానికి చెందిన దేవర మల్లయ్యను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్ సీనియర్ నాయకులు ఈ ప్రకాష్‌రావు, దాదారావ్, మాజీ ఎంపీటీసీ వెంకన్న యాదవ్, రాములు సార్. రవుల నారాయణ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

ఉట్నూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిగోండు గూడకు చెందిన అనసూయను పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో 108 అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో నొప్పులు తీవ్రమవడంతో అంబులెన్స్ నిలిపి ఈఎంటీ అజ్మీర ప్రవీణ్‌కుమార్ సుఖ ప్రసవం చేశారు. ప్రసవం అనంతరం పాపకు తల్లికి మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ సిబ్బంది ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ ప్రవీణ్‌కుమార్, పైలట్ రాజేందర్‌లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత

బోథ్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని, లేకుంటే భావితరాలకు నష్టం చేసిన వారమవుతామని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలు అటవీ శాఖ వారి సౌజన్యంతో బోథ్ నేచర్ కన్సర్వేషన్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆవు పేడతో తయారు చేసిన దీపాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. భవిష్యత్ తరాలకు పర్యావరణంపై అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, అటవి శాఖ అధికారి ప్రణయ్, వివేకానంద యూత్ సభ్యులతో పాటు నేచర్ కన్సర్వేషన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆవు పేడతో తయారు చేసిన దీపాలను వెలిగిస్తున్న ఎమ్మెల్యే

అన్ని పంటలకూ బోనస్ ఇవ్వాలి:ఎమ్మెల్యే

రైతులు పండించిన అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని, ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జొన్నతోపాటు స్వయాభిల్ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు కదం ప్రశాంత్, సీఈఓ గోలిస్వామి, ఆత్మ చైర్మన్ జి.రాజుయాదవ్, మాజీ సర్పంచ్ సురేందర్‌యాదవ్, జడ్పీటీసీ సంధ్యారాణి ఉన్నారు.

గ్రామ పంచాయతీలు గాడిన పడేదెన్నడో?

(5వ పేజీ తరువాయి)

సరిగ్గానిధులు ఇవ్వడంతో ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించడంతో పాటు విద్యుత్ ఖర్చులు చేస్తూ గ్రామ పంచాయతీల నిర్వహణ సక్రమంగా నిర్వహించారు. మరోకొన్ని నెలల్లోనే సార్వత్రిక ఎన్నికలు వస్తాయని భావించిన ప్రభుత్వం పంచాయతీలకు నిధులు నిలిపేసింది. అప్పటికే జీపీల్లో పారిశుధ్య చర్యలు, మురికి కాలువల నిర్మాణాలు, సిమెంట్ రోడ్లు, బోరుబావుల మరమ్మతులు పనులుచేసిన సర్పంచులు నిధుల్లేక నీరసించిపోయారు. జిల్లాలో ఉన్న ప్రతీ జీపీ కార్యదర్శి సుమారు 2లక్షల నుంచి 3లక్షలు దుకాణాలలో ఉద్దెర తెచ్చి అప్పుల పాలైనట్లు తెలుస్తోంది. వాహన మరమ్మతులు నిధులులేని పరిస్థితి నెలకొంది.

పైసా ఇవ్వని ప్రభుత్వం

రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారం చేపట్టినా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదు. గత మూడేళ్లుగా స్టేట్‌ఫైనాన్స్ నిధులు పంచాయతీలకు మంజూరు కావడం లేదు. జనాభా ప్రాతిపదికన మైనర్, మేజర్ గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా తలకు రూ.892 వంతున కేటాయించేది. జిల్లాలో ఉన్న 467 గ్రామ పంచాయతీలలో ఉన్న జనాభా అవసరాలను బట్టి ఏడాదికి ఒక్కో పంచాయతీకి సుమారు రూ.2.50లక్షల వరకు రావాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలో ఉన్న మొత్తం పంచాయతీలకు ఏడాదికి సుమారు రూ.16కోట్ల వరకు విడుదల కావాల్సి ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడంలేదని భావించిన కేంద్రప్రభుత్వం సైతం నిధులు మంజూరు చేయడం లేదు. కేవలం మల్టిపర్పస్ వర్కర్ వేతనాలు మాత్రమే అందిస్తున్న ప్రభుత్వం రెగ్యూలర్ కార్యదర్శుల వేతనాలు అందిస్తూ ఔట్‌సోర్సింగ్ కార్యదర్శుల వేతనాలు అందించడం లేదు.

ఆరు నెలలుగా వేతనాల్లేవ్..

జిల్లాలో రెగ్యూలర్ సెక్రటరీలు 425 మంది ఉండగా జూనియర్ పంచాయతీ సెక్రటరీలు 12 మంది, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలు 32మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు సైతం నిలిచిపోయాయి. అలాగే రెగ్యూలర్ కార్యదర్శులకు ప్రతినెలా జీతం వస్తున్నా ఔట్‌సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలు ఆరు నెలలుగా వేతనం కోసం ఎదురు చూస్తున్నారు.

పంచాయతీల ఎన్నికలు నిర్వహించాలి

● రితేష్ రాథోడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు



గ్రామస్వరాజ్యం దిశగా ప్రభుత్వం సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. గతంలో బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేయగా.. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో పనిచేస్తోంది. ప్రభుత్వం నిధులు కేటాయించి గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలి.



ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం.

● రాంప్రసాద్, ఎంపీడీఓ ఉట్నూర్

గ్రామ పంచాయతీల ఎన్నికల ఏర్పాట్ల కోసం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఎప్పుడు వస్తే అప్పుడు ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

నిర్మల్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ జానకి షర్మిల సూచనల మేరకు మండలంలోని కొండాపూర్ వద్ద జాతీయ రహదారిపై మైనర్ డ్రైవింగ్, నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడపడంపై ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు రూరల్ సీఐ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఎటువంటి పరిస్థితుల్లో మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దన్నారు. తనిఖీలలో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు సన్మానం

నిర్మల్‌ఖైన్‌గేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉత్తమర్యాంక్‌లతో సీట్లు సాధించిన ఇద్దరు అమ్మాయిలకు ఆదివారం దామెర సాహితీ క్షేత్రం నిర్మల్ నర్సింగ్ హోమ్‌లో సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో నర్సింగ్‌హోమ్ సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు. దామెరశోభారాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో డాక్టర్ దామెర రాములు వారిని అభినందించారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో సన్మానం చేశారు.



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

సందడిగా దండారి



గుస్సాడి వేషధారణలో డీసీసీ అధ్యక్షులు కుచాడి

సారంగాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల పెండల్‌దరి గ్రామంలో ఆదివారం గోండు కులస్తులు ఆనవాయితీగా నిర్వహించే దండారి పండగ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దీపావళి పర్వదినాన్ని పుర్కరించుకొని గొండ్ తెగ కులస్తులు తమ సంప్రదాయ పండుగ దండారిని ఎంతో ఉత్సాహంగా, సాంప్రదాయ పద్ధతులను నిర్వహించడం గోండు కులస్తులు మర్చిపోలేరని అన్నారు. గుస్సాడి ముత్యాలు, గుస్సాడి వేషధారణలో ఉన్న యువకులు పల్లెల్లో అంగరంగ వైభవంగా సంగీతం, నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, మండల నాయకులు, మధుకర్ రమేష్, భోజన్న, పోతన్న, రాజేశ్వర్, ముత్యంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తండా వసూలుఉన్నారు.

కుంటాలలో ఉచిత వైద్య శిబిరం

కుంటాల, అక్టోబరు, 19 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కుంటాలలో ఆదివారం రోజు ఆరాధన ఆయుర్వేద వెల్‌నెస్ రిసెర్చ్ సెంటర్, ఆరాధన సూపర్ స్పెషాలిటి ఆధ్వర్యంలో మండల కేంద్రం కుంటాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో పలువురికి ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జూలీ, సాయికుమార్, ఫార్మాసిస్ట్ అవినాష్, అడ్మినిస్ట్రేటర్ శ్రీనివాస్, పాపేష్ ఉన్నారు.

ఘనంగా బుద్ధ వందన

భైంసా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భైంసాలోని నర్సింహానగర్ ప్రాంతంలో గల బుద్ధవిహార్‌లో ఆదివారం బుద్ధవందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బౌద్ధ బంధువులు బుద్ధవందనకు భారీసంఖ్యలో హాజరయ్యారు. బుద్ధ విహార్ టీం ఆధ్వర్యంలో బౌద్ధ బంధువులు సాముహికంగా త్రీసరణా-పంచశీల పఠించారు. ఈ సందర్భంగా శ్రామినార్ పాండురంగ్ జాదవ్ బుద్ధుని బోధనలు అనుసరణీయమని పేర్కొన్నారు. బుద్ధుడు బోధించిన పంచశీల సూత్రాలను అనుసరించడం ద్వారా మానవాళికి సత్ఫలితాలు కలుగుతాయని తెలిపారు. తాత్వికబోధనలు, శాంతి, శీలం, సహనం అనే ధర్మాలతో సమాజంలో శాంతి స్థాపనకు గౌతం బుద్ధుడు కృషి చేశారని పేర్కొన్నారు. బుద్ధవందన కార్యక్రమంలో భాగంగా గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధవిహార్ టీం ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

లక్ష్మణచాంద, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీచర గ్రామానికి చెందిన యువకుడు నైనం శేఖర్ (28) అనే యువకుడు క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం జరిగింది. ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... శేఖర్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యం నయం కాకపోవడంతో మానసిక వ్యథ తీవ్రమై పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకుని మరణించినట్లు ఆయన వెల్లడించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

లోకేశ్వరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలో గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రామన్‌వార్ నారాయణ మండలంలోని పిప్రి ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవలే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యారు.

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుపై ఏసీబీ మెరుపుదాడి



బేల్ తరోడా అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు

తానూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బేల్ తరోడా గ్రామ సరిహద్దున గల అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుపై శనివారం రాత్రి 12:30 గంటల ప్రాంతం నుంచి ఉదయం 4:30 గంటల వరకు ఏసీబీ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. చెక్‌పోస్టు కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని రోజువారీ వాహనదారులు పన్నుల రూపంలో చెల్లించే ఆదాయ లావాదేవీలను, రికార్డులను, కంప్యూటర్ లావాదేవీలను పరిశీలించారు. కాగా కార్యాలయ ఆవరణలో ఉన్న ఒక డబ్బా పెట్టెలో మూడు వేల నగదు దొరకడంతో ఆ డబ్బును సీజ్ చేశారు.

భైంసాలో పోలీసుశాఖ నాకాబందీ

భైంసా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భైంసాలో పోలీసులు ఆదివారం నాకాబందీ నిర్వహించారు. సాయంత్రం వేళ నుంచి రాత్రి వరకు భైంసా పట్టణ నాలుగు మార్గాల వద్ద నాకాబందీ కొనసాగింది. టౌన్ సీఐ గోపినాథ్ నేతృత్వంలోని పోలీసు బృందాలు నాలుగు మార్గాల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేశారు. నెంబర్ ప్లేట్, ధృవీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనపరుచుకున్నారు. మైనర్లు నడుపుతున్న వాహనాలను సైతం స్వాధీపరుచుకున్నారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. చాలన్ పెండింగ్‌లో వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

కుభీర్ : మండల కేంద్రం పోలీస్టేషన్‌లో ఆదివారం పోలీసులు వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు వాహనాలను ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా వాహనాలను నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు ఉన్నారు.

దీపోత్సవం

నిర్మల్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగను పురస్కరించుకొని గండిరామన్న సాయిబాబా ఆలయంలో ఆదివారం దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయి దీక్ష సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం దీపావళికి ఇక్కడి సాయిబాబా ఆలయంలో దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దీపాలను వెలిగించడం ద్వారా చీకటిని తొలగించి ఐశ్వర్యాన్ని ఆహ్వానిస్తామని, అలాగే వెలిగే ప్రతి దీపం లక్ష్మీదేవి రూపంగా భావిస్తామన్నారు.


ఆదివాసీలతో గుస్సాడీ దండారి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉమ్మడి జిల్లాలో ఘనంగా
గుస్సాడీ దండారి ఉత్సవాలు

- గుస్సాడీ నృత్యానికి గిన్నిస్‌బుక్‌లో చోటు కోసం కృషి చేస్తా: ఎమ్మెల్యే వెడ్మబొజ్జు
- గుస్సాడీ దండారి ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- గుస్సాడీ నృత్యాలు దేశంలోనే ఆదర్శం: ఎంపీ నగేష్

ఉట్నూర్/ఇంద్రవెల్లి/ఆదిలాబాద్(బోథ్)/నేరడిగొండ/ఆదిలాబాద్(సిరికొండ)/తలమడుగు/బజార్‌హత్నూర్/నార్నూర్,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల గుస్సాడీ దండారి ఉత్సవాలకు గిన్నిస్‌బుక్‌రికార్డులో చోటు లభించేలా కృషి చేస్తానని ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం దీపావళి దండారి ఉత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన దండారి ఉత్సవాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 1000 గుస్సాడి బృందాలకు రూ.1.50కోట్లు కేటాయిస్తున్నారని ప్రతి దండారి బృందానికి రూ.15వేల వంతున ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలంగాణ సాంస్కృతిలో భాగంగా బతుకమ్మ ఉత్సవాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న తరహాలోనే దండారి ఉత్సవాలను సైతం ప్రభుత్వ పరంగా నిర్వహించడానికి కృషి చేసేలా ప్రాతినిధ్యం చేస్తామన్నారు.రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లికృష్ణారావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రతిపాదిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కనకరాజుకు పద్మశ్రీ అవార్డు ఇచ్చి సత్కరించినందున రాబోయే రోజుల్లో ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలతో ముడిపడి ఉన్న గుస్సాడీ దండారి ఉత్సవాలకు సైతం గిన్నిస్‌బుక్ రికార్డులో దక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలోని రాజంపేట, దుర్గాపూర్, టక్కుగూడ, కల్లూరు, గూడలకు చెందిన గుస్సాడీ బృందాలు ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు క్యాంపు కార్యాలయానికి చేరుకుని శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు గుస్సాడీ దండారి నృత్యాలను ప్రదర్శించారు.

ఘనంగా దీపావళి దండారి వేడుకలు

ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలతో ముడిపడి ఉన్న దీపావళి దండారి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యే కోరిక మేరకు ఏజెన్సీలోని రాజంపేట, దుర్గాపూర్, టక్కుగూడ, కల్లూరుగూడ గ్రామాలకు చెందిన దండారి బృందాలు శనివారం రాత్రి చేరుకుని ఆదివారం సాయంత్రం వరకు దండారి సాంస్కృతి సాంప్రదాయాల నృత్యాలతో సందడి చేశాయి. ఆదిలాబాద్ (సిరికొండ)ఆటాపాటలతో గిరిజన ఆదివాసీ గూడేలన్నీ మార్మోగుతున్నాయి. ఇంద్రవెల్లిలో ఆదివాసులు నియమ నిష్టలతో ఆచరించే సంస్కృతీ, సంప్రదాయాలు పవిత్రమైనవని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు.ఆదివారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో గుస్సాడి దండారీ ఉత్సవాల్లో ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆదివాసీ గిరిజన సంస్కృతి సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఏత్మాసూర్ పేన్‌కు దండారీ నిర్వాహకులతో కలిసి సంప్రదాయ పూజలు చేశారు.ఈ సందర్భంగా గుస్సాడి నృత్యాలను తిలకించారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్, స్థానిక ఎస్సై సాయన్న, ఆదివాసీ పెద్దలు చెంచు రామకృష్ణ, గ్రామ పటేల్ మెస్రం వెంకట్రావు పటేల్, మెస్రం బాజీరావు పాటేల్, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్, గ్రామస్థులు మెస్రం తుకారం, కోట్నాక్ బారిక్ రావు, పెందోర్ గణేష్, తదితరులు పాల్గొన్నారు. ఆదిలాబాద్(బోథ్) ఆదివాసీ నృత్యాలు దేశంలోనే పేరు గాంచాయని ఆదివాసీ కళలు ఎప్పుడు మరిచి పోవొద్దని ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు. నేరడిగొండ ఆదివాసీగూడాల్లో అంగరంగ వైభవంగా దండారి పండుగ సంబరం కొనసాగుతోంది. ఆదివారం మండలంలోని లింగట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొని దండారి నృత్యాలు చేసారు.ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్లు మల్లేష్, బీంరావు, ఆత్రం లక్ష్మణ్, దేవారి, మహారాజన్, పెందుర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.మండలంలోని కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన దండారి ఉత్సవాలకు బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండపోతన్న ఈ సందర్భంగా గుస్సాడిల నృత్యాలను తిలకించారు.తలమడుగులో భారతదేశంలో ఆదివాసిసంస్కృతి సాంప్రదాయం చాలా గొప్పదని తెలంగాణ రాష్ట్రజాగృతి ఉపాధ్యక్షురాడు లలిత యాదవ్‌అన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి సభ్యులు చంద్రశేఖర్, బాలు, వేణుగోపాల్ యాదవ్, జరీ పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామపటేల్, కుమ్రా నరేందర్ మాజన్, సడం వినోద్, గటియల్ శ్రీకాంత్, విసురు పటేల్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లలిత నారాయణ, పాల్గొన్నారు.బజార్ హత్నూర్ ఆదివాసి గూడాల్లో దండారి ఉత్సవాలు కొనసాగుతుండటంతో గ్రామాల్లో దీపావళి కళ ఉట్టిపడుతోంది. ఈ కార్యక్రమంలో పటేల్ భీమ్‌రావు, దేవరీ భూమన్న, ఆదివాసీ యూత్ అధ్యక్షుడు సిడం సుభాష్, గ్రామ పెద్దలు, గ్రామ పటేల్, గ్రామస్థులు పాల్గొన్నారు. నార్నూర్‌లో అడవుల జిల్లా ఆదివాసుల జిల్లాలో ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయాలు విభిన్న మైనవని, భావితరాలకు తెలియజేసే విధంగా అభివృద్ధి చెందుతూ ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.ఈకార్యక్రమంలో ఉట్నూర్ సీఐ ప్రసాద్, నార్నూర్ సీఐ పద్మ, జిల్లా మేడి మెస్రం దుర్గు పాటేల్, నార్నూర్ తహసీల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.


చింతల్ సాంగ్విలో సామూహికంగా పూజలు


గుస్సాడీలతో బోథ్ వీడీసీ చైర్మన్


ఉట్నూర్‌లో గుస్సాడీ నృత్యం చేస్తున్న దృశ్యం


ఎస్పీని సన్మానించిన మెస్రం వెంకట్‌రావు పటేల్


మాట్లాడుతున్న ఎంపీ నగేష్

దీపాల కాంతులు.. జీవితాల్లో వెలుగులు

- జిల్లాలో దీపావళికి సర్వం సిద్ధం
- లక్ష్మీ పూజలకు ఏర్పాట్లు
- మార్కెట్‌లో మొదలైన పండగ సందడి, పెరిగిన టపాకాయల ధరలు


టపాకాయల అమ్ముతున్న దుకాణాదారులు

ముథోల్/భైంసా,అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి):దీపావళి అంటే దీపాల వరుస... పటాకుల మోతలు... కాకరపూల కాం తులు... భూచక్రాల వెలుగు లు... చిచ్చుబుడ్ల జిలుగులు ... పసందైన పిండి వంటలే కాదు...అల్లరిపిల్లలు, పెద్దలు, కేరింతలు, తుల్లింతలు కలగ లిసిన పండుగ. వెలుగు పూల వేడుక...! చీకట్లను పారదోలి వెలుగులను నింపే దివ్వెల పండుగ దీపావళికి జిల్లా అంతా సిద్ధమైంది. ఇళ్లను శుద్ధి చేసి రంగు రంగుల పూలు, మామిడాకుల తోరణాలతో అలంకరించకోనున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులతో ప్రతిఇళ్ల శోభను సంతరించుకోగా, లక్ష్మీ పూజలు, నోము లకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ పండగతో అందరి జీవితాల్లో కష్టాలు తొలగి వెలుగులు నింపాలని ఆశిస్తున్నారు. అక్టోబరు 20న సోమవారం రోజున దీపావళి ఉండటంతో జిల్లా వ్యాప్తంగా మార్కెట్‌లో దీపావళి సందడి మొదలైంది.

గ్రీన్ క్రాకర్స్ సురక్షితం...

గతంలో మార్కెట్‌లో లభ్యమయ్యే టపాసుల్లో రేడియం నైట్రేట్‌ను ఉపయోగించేవారు. దీని వల్ల వాయు, శబ్ధ కాలుష్యాలతో పాటు అనారోగ్య సమస్యలు కూడా ఏర్పడేవి. దీంతో గ్రీన్ క్రాకర్స్‌ను మాత్రమే తయారు చేసేలా చూడాలని 2019లో సుప్రీం కోర్టు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆదేశించింది. ఇప్పుడు ఇవి మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. వీటిని కాల్చడం ద్వారా కాలుష్యం బారిన పడకుండా ఉండవచ్చు. సాధారణ టపాసుల మాదిరిగానే కాంతి, శబ్దాన్ని విడుదల చేసే గ్రీన్స్ క్రాకర్స్ మామూలు వాటికంటే 70 శాతం సురక్షితమని నిపుణులు చెబుతున్నారు.

నియమాలను పాటించాలి...

బాణసంచా వ్యాపారులు దుకాణాల వద్ద డ్రమ్ములో నీటిని ఉంచుకోవాలి. వీటితో పాటు ఒక ఫైర్ కంట్రోల్ సిలిండర్‌ను ఏర్పాటు చేయాలి. ఫైర్ ప్రూఫ్ మెటీరియల్‌తో షాపులు ఏర్పాటుచేసుకోవాలి. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే 101కు ఫోన్ చేయాలి. దుకాణం దుకాణం మధ్య స్థలం విడిచి ఉండాలి. ప్రతి విక్రయదారుడు లైసెన్స్ కలిగి ఉండాలి. చిన్న పిల్లలతో బాణ సంచాలు విక్రయించరాదు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. ప్రజలు కాటన్ దుస్తులు ధరించి, కళ్లకు అ ద్దా లు పెట్టుకోని ఖాళీ స్థలంలో బా ణ సంచా కాల్చాలి.

- డి. ప్రభాకర్, జిల్లా అగ్నిమాపక అధికారి, నిర్మల్

ఆకాశాన్నంటుతున్న టపాసుల ధరలు

ఆదిలాబాద్(బోథ్),అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): సోనాల మండాల్లో టపాసుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.టపాసులు తయారీకి కెమికల్స్ ధరలు తగ్గిన టపాసులు ధరలు మాత్రం రాకెట్ల దూసుకుపోతున్నాయి.

నాసిరకం టపాసుల విక్రయాలు

పండుగకు పెద్ద మొత్తంలో వ్యాపార వర్గాల వారు టపాసులను కొనుగోలు చేస్తుంటారు. అయితే టపాసుల వ్యాపారులు నాసిరకమైన టపాసులను విక్రయిస్తున్నారన్నారు. యేడాది కేడాది టపాసుల తయారీలో మార్పులు జరుగడం వల్ల ఏది అసలు ఏది నకిలీ అనేది తెలియకుండా పోతున్నది. మరోవైపు ధరలకు కళ్లెం వేసేవారు లేక ఇష్టానుసారంగా విక్రయాలు జరుపుతున్నారు. దీంతో పాటు టపాసుల వ్యాపారులు సిండికేట్గా మారి విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

కోటి రూపాయల వ్యాపారం


బోథ్, బజార్హత్నూర్, సోనాల మండలాల్లో టపసుల వ్యాపారం కోటి రూపాయల వరకు జరుగుతుందని అంటున్నారు. ముఖ్యంగా టపాసులను మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు ఇష్టానుసార ధరల్లో విక్రయిస్తున్నారని అంటున్నారు. నియోజకవర్గంలో ఆదివాసీ గూడెలు ఉండడం ఆదివాసీలకు దీపావళి పండుగ గొప్పది కావడంతో వారి వారి ఆర్థిక పరిస్థితులను బట్టి కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు టపాసులు తయారీకి ఉపయోగించే కెమికల్స్ ధరలు తగ్గుముఖం పట్టిన టపాసులు ధరలు మాత్రం తేడా లేకుండా ఉంది.

సరికొత్త రకాలపై ఆసక్తి

కొత్త కొత్త రకాల టపాసులు మార్కెట్లోకి రావడంతో వాటిని కొనేందుకు పిల్లలు పెద్దలు ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు మాత్రం రాకెట్ లాంచర్ల పరుగులు పెట్టిస్తున్నారు. సుతిలి బాంబులు పేలినట్లు ధరలు పేలుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఒక్కో పాకెట్ ధర రూ.250లకు తక్కువ లేదని గత యేడాది చిన్న చిన్న పటాకల పాకెట్లు రూ.80ఉంటే ఈ యేడాది ఒక 150కి పెంచి విక్రయిస్తున్నారని అంటున్నారు. శవయాత్ర సందర్భంగా ప్రతి గ్రామంలో టపాసులు పేల్చడం ఆనవాయితిగా మారింది. దీంతో వ్యాపారులు ధరని పెంచి విక్రయిస్తున్నారని అంటున్నారు.

జనవాసాల మధ్యనే విక్రయాలు

టపాసుల విక్రయాలు జనవాసాలకు దూరంగా ఉండాలని నిబంధనలు ఉన్న అధికారులు అవేమి పట్టించుకోక పోవడంతో జనవాసాల మధ్యనే టపాసులు విక్రయాలు కొనసాగుతున్నాయి.ఈ విషయం చూసి చూడనట్లుగా ఉంటున్నారన్నారు.



దీపావళి శుభాకాంక్షలు : కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలు, అధికారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి విజయం సాధించిన ప్రతీకగా దీపావళిని జరుపుకుంటామని, ప్రతి ఇంటిలో ఆనందం, వెలుగు నిండాలని ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖశాంతులు, సమృద్ధి కలగాలని కోరుకుంటూ టపాసులు పేల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు.

నేడు దీపావళి

● అంతటా సందడి


భైంసాలో జోరుగా కొనసాగుతున్న పూల కొనుగోళ్లు

భైంసా,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజానీకం సిద్ధయింది. వ్యాపారస్తులు తమ తమ వ్యాపార సంస్థలను సోమవారం జరుపుకునే లక్ష్మీపూజల కోసం పూలు, అరటిబోదేలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. గృహిణులు తమ తమ నివాస గృహాలను ప్రమీదలు,మామిడి తోరణలతో ముస్తాబు చేశారు. ఆదివారం జిల్లాలోని ప్రధాన ప్రాం తాలన్నీ పర్వదిన నిర్వహణకు జరిగిన కొనుగోళ్లతో సందడిగా మారింది. పూలు, ప్రమీదలు, స్వీట్స్, బాణసంచా కొనుగోళ్లు జోరుగా కొనసాగాయి. జిల్లాలోని పల్లె, పట్టణ ప్రాంతాలన్నీ దీపావళి కోసం సిద్ధమయ్యాయి.

● **చీకటిపై విజయం. . . . . .**

దీపావళి ఇంటిళ్ళిపాది ఆనందంగా జరుపుకునే వెలుగుల పండుగ. ఈ దీపోత్సవ వేళ దీపలక్ష్మి శత సహస్ర కిరణ కాంతులతో అమావాస్య నాటి అజ్ఞానపు చీకట్లను పారదోలి జగత్తును తేజోమయం చేసి జ్ఞాన జ్యోతులను ప్రకాశింపజేస్తుంది. చీకటిపై వెలుతురు, అసత్యంపై సత్యం విజయం సాధించినందుకు గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటారు. ఉత్తర భారతదేశంలో ఈ పండుగను ఐదురోజుల పాటు జరుపుకుంటారు. దక్షిణాదిన మూడురోజుల పాటు జరుపుకుంటారు.

● **తీసుకోవాల్సిన జాగ్రత్తలు. . .**

దీపావళి పండుగ సందర్భంగా పిల్లలు టపాసులు ఉత్సాహంగా కాలుస్తారు. ఆకాశం వైపుకు దూసుకెళ్ళే తారాజువ్వలు, చెవులు చిల్లులు పడేలా శబ్దం చేసే టపాకాయలు, వెలుగులు విరజిమ్మే చిచ్చుబుడ్లు తదితర టపాసులు కాలుస్తారు. వీటిని కాల్చే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కాల్చేటప్పుడు బకెట్‌తో నీళ్ళు సిద్ధంగా ఉంచుకోవాలి. రాకెట్‌లను పెట్రోల్ బంకులు, గడ్డి వాములకు దూరంగా కాల్చాలి. చట్ట ప్రకారం అనుమతి పొందిన దుకాణాల్లోనూ బాణసంచా కొనుగోలు చేయాలి. టపాసులు కాల్చేటప్పుడు బిగుతుగా కాటన్ దుస్తులను ధరించాలి. బాణసంచా కాల్చే సమయంలో వెలువడే విష వాయువు పీల్చకుండా మాస్కు ధరించాలి. నేరుగా అగ్గిపుల్లలు వాడకుండా, అగరబత్తుల సాయంతో టపాకాయలు కాల్చాలి. ప్రమాదం జరిగిన వెంటనే శరీరంపై ఆ ప్రదేశాన్ని నీటితో తడపాలి. శ్వాస, గుండె వ్యాధి బాధితులు బాణాసంచాకు దూరంగా ఉండాలి. దీపావళి పండుగ సంస్కృతిలో ఒక భాగం. నాడు కొత్త దుస్తులు, వేసుకుని, పిండి వంటలు చేసుకుని మట్టి దీపాలతో ఇళ్ళను అలంకరించి, ఆటపాటలతో, దివిటీలు తిప్పుతూ పండగను జరుపుకునే వారు.

వైద్యరంగంలో నిష్ణాతులు కావాలి


సన్మాన గ్రహితలతో అమేవా ప్రతినిధులు

భైంసా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల ద్వారా ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులు ఉత్తమ చదువులు, ఫలితాలు సాధించి వైద్యరంగంలో నిష్ణాతులుగా ఎదగాలని అరే మరాఠా ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ భైంసా డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిందే హన్మంత్‌రావ్ పాటిల్, బోస్లే గంగాధర్‌లు అకాంక్షించారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి మెడికల్ కళాశాలల్లో సీట్లు పొందిన అరే మరాఠా సంఘానికి చెందిన విద్యార్థులకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. సంఘం భైంసా అధ్యక్షులు కదం మోహన్‌రావ్ పాటిల్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మెన్ బోస్లే నంద కిషోర్ పాటిల్, అమేవా గౌరవ అధ్యక్షులు నర్వాడే వసంత్ రావ్ పాటిల్‌లు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయంగా ఉన్నాయన్నారు. అమేవా ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

గజ్జలమ్మ ఆలయంలో భక్తుల పూజలు

కుంటాల, అక్టోబరు, 19 : (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రం కుంటాల గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని గజ్జలమ్మ ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నిబంధనలు పాటించాలి


ఎస్పీ డా.జానకి షర్మిల

దిలావర్‌పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజలు భద్రత సూచనలు పాటిస్తూ దీపావళిని సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ డా.జానకి షర్మిల అన్నారు. జీవితంలో అంధకారాన్ని జయించి వెలుగును ఆహ్వానించే దీపావళి పండుగ ప్రతి ఇంట్లో వెలుగు, సంతోషం, శాంతి, సౌభాగ్యం నింపాలని ఆకాంక్షించారు. పోలీసులు సూచించిన భద్రత సూచనలు పాటిస్తూ పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా ప్రజలు, అధికారులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

జోనల్‌స్థాయి రెజ్లింగ్‌పోటీలకు ఎంపిక


పోటీల్లో పాల్గొన్న రెజ్లింగ్ క్రీడాకారులు

భైంసా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది రెజ్లింగ్ క్రీడాకారులు జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం భైంసాలోని ఖేలో ఇండియా వూషు సెంటర్‌లో జోనల్‌స్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 40 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, ఇందులో నుంచి ప్రతిభను చాటుకున్న 11 మంది క్రీడాకారులు జోనల్‌స్థాయికి ఎంపికయ్యారు. వచ్చే నెల మంచిర్యాల జిల్లాలో జరుగనున్న జోనల్‌స్థాయి రెజ్లింగ్ పోటీలలో ఈ క్రీడాకారులు పాల్గొననున్నారు. ఎస్‌జీఎఫ్ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఏ.రవీందర్‌గౌడ్, కన్వీనర్ రమణరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ నేతృత్వంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో 14 సంవత్సరాలలోపు ఫ్రీస్టైల్ విభాగంలో డి.కరణ్, 17 సంవత్సరాలలోపు ఫ్రీస్టైల్ విభాగంలో బాలాజీ, రాంచరణ్, అయ్యాజ్‌ఖాన్, బీ. రామకృష్ణ, కె. యోగేశ్వర్, సాయి ప్రసాద్, షేక్ అర్బాస్, గ్రీకో రోమన్ విభాగంలో జి. రణవీర్, జాదవ్ శివానంద్, బి. భగాజీ జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వ్యాయమ ఉపాధ్యాయులు కె. శ్రీనివాస్, సాయికృష్ణ, సాగర్, రాథోడ్ రాజు, జ్ఞానతేజలు ఎంపిక పోటీలకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు.